

మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన మహబూబ్‌నగర్ పట్టణ ప్రధాన రహదారి



దాహార్తిని తీర్చుకునేందుకు చెరుకు రసం తాగుతున్న ప్రజలు

భానుడి భగభగ

- ముదురుతున్న ఎండలు
- 40 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రత
- ఉక్కపోత.. వడగాలులలో అల్లాడుతున్న జనం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1: ఎండకాలం ప్రారంభమైంది. ఏప్రిల్ రావడంతో ఎండలు ముదురుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే 40 డిగ్రీలకు చేరుకున్నాయి. ఉక్కపోత, వడగాలులతో జనం అల్లాడుతున్నారు. ఎంత నీరు తాగినా దాహం తీరక పోవడంతో పండ్ల రసాలు, మజ్జిగ, శీతల పానీయాలు తాగుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వడ గాల్పులు వీస్తున్నాయి. ఆ సమయంలో బయట తిరిగే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్ రెండో వారం నుంచి మే వరకు మరింత ఉష్ణోగ్రత పెరుగనుంది.

మహబూబ్‌నగర్ జిల్లాలో గత నెల ఉష్ణోగ్రత వివరాలు

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
25	36.9	26.0
26	38.0	28.6
27	38.1	25.0
28	39.2	25.0
29	40.5	25.6
30	40.0	27.3
31	39.0	26.1
1/4	39.0	25.7

ప్రత్యామ్నాయాలపై దృష్టి

ఎండలు ముదురుతుండటంతో జనం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నారు. ఏసీ, కూలర్లను వినియోగిస్తున్నారు. చల్లటి నీళ్ల కోసం మట్టికుండలు, ఇల్లు చల్లగా ఉండేందుకు కప్పుపై కూల్ సిమెంట్‌లను వాడుతున్నారు. దాహార్తి తీర్చుకునేందుకు అంబలి, మజ్జిగ, కొబ్బరిబోండాలు, చెరుకు రసాలు, పండ్ల రసాలు తాగుతున్నారు. ఉక్కపోతకు సమ్మర్ దుస్తులను వినియోగిస్తున్నారు. ఇంట్లో కొద్దిసేపు కరెంట్‌పోతే భరించలేని ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాహనాలపై తిరిగే వారు పురుషులు క్యాప్‌లు, మహిళలు స్కార్ఫ్ ధరిస్తున్నారు. వీధి వ్యాపారాలు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన వ్యాపారాలు చేసుకునే వారంతా ఎండవేడిమితోపాటు తారురోడ్డు సెగతో అల్లాడిపోతున్నారు.



ఎండకు చున్నీ కప్పుకొని వెళ్తున్న యువతి



ఎండ నుంచి రక్షణకు చేతి రుమాలు తలకు కట్టుకున్న వ్యక్తి



ఎండకు స్కూటీపై వ్యక్తి క్యాప్ ధరించగా.. స్కార్ఫ్ ధరించిన మహిళ



ఎండకు గొడుగు పట్టుకొని వెళ్తున్న యువతులు

పోలీసుల మెడకు.. ట్యాపింగ్ ఉచ్చు



- వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కేంద్రంగా ట్యాపింగ్‌పై ఆరోపణలు
- గతంలో ఇక్కడ పని చేసిన ఓ అధికారికి త్వరలో నోటీసులు
- ఎమ్మెల్యే యెన్నం, కౌన్సిలర్ ఫిర్యాదుతో విచారణ ముందడుగు
- అక్రమ కేసులు, బెదిరింపులకు పాత సీఐ బాధ్యుడనే ఆరోపణలు
- ఆయన చెప్పినట్లు నడుచుకున్న పట్టణంలోని మిగతా పోలీసులు



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గతంలో పని చేసిన కొందరు పోలీసు అధికారులకు ట్యాపింగ్ ఉచ్చు చుట్టుకోనుంది. పాలమూరులో ట్యాపింగ్ జరిగిందని ఇప్పటికే కొన్ని ఆధారాలతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి డీజీపీ ఫిర్యాదు చేయగా.. ఆ తర్వాత మహబూబ్‌నగర్‌లోని 43వ వార్డు కౌన్సిలర్ అప్పటి సీఐ రాజేశ్వర్ గౌడ్‌పై జిల్లా ఎస్పీని కలిశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రాష్ట్ర స్థాయిలో ఒక్కొక్క నిందితుడిని అదుపులోకి తీసుకుంటుండగా.. ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్‌రావు కూడా త్వరలో లొంగిపోనున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి డీజీపీని కలిసిన సమయంలో జిల్లాలకు ఈ కేసు పరిధిని విస్తరించాలని కోరడంతో రాష్ట్రంలోని మిగతా ముఖ్య నాయకులు కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు బహాటంగానే ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం దర్యాప్తు జిల్లాలకు కూడా విస్తరించనున్నట్లు సమాచారం. అదే జరిగితే అప్పట్లో గత ప్రజాప్రతినిధులు చెప్పినట్లు అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసు అధికారులంతా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. త్వరలో మహబూబ్‌నగర్‌లో గతంలో సీఐగా పని చేసిన ఓ అధికారికి పోలీసులు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అప్పట్లో ఈ సీఐ ఏం చెబితే అది నడిచినట్లుగా జిల్లా కేంద్రంలో ప్రచారం ఉంది. తన కేడర్ ఉన్న మిగతా సీఐలను కూడా సదరు సీఐ కనుసన్నల్లో ఉంచుకుని ప్రజాప్రతినిధులు కోరినట్లుగా నడుచుకున్నారనే విమర్శలున్నాయి. మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక వార్ రూంలు ఏర్పాటు చేసి మరీ.. ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆరోపణలు మొదటి నుంచీ ఉన్నాయి. ఇటీవల మహబూబ్‌నగర్‌లోని ఓ పోలీస్ స్టేషన్ పక్కనే ట్యాపింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో ఈ అంశం కొలిక్కి వస్తే.. జిల్లాల పరిధికి విస్తరించే అవకాశం కచ్చితంగా ఉంది. ఈ లోపు పోలీసులకు అందుతున్న ఫిర్యాదులను తీసుకుని, వాటి ఆధారంగా మొదట నోటీసులు ఇచ్చి విచారణ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.



ప్రత్యేక నిఘా వ్యవస్థ..

అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు మేలు చేకూర్చడం, ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇబ్బందులు పెట్టడం కోసం పోలీసులు గతంలో శతవిధాలా ప్రయత్నించారని తాజా పరిణామాలతో తేటతెల్లమవుతోంది. మహబూబ్‌నగర్‌లో గతంలో పనిచేసిన ఓ సీఐ కేంద్రంగా ఈ ట్యాపింగ్, వేధింపులు, బెదిరింపుల తతంగం అంతా జరిగినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ట్యాపింగ్ రూంను ఏర్పాటు చేసినట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. అప్పుడు ఉన్న ప్రజాప్రతినిధులు సైతం ఎంపిక చేసుకున్న కొందరు పోలీసు అధికారులను ప్రోత్సహించడం, వారిని పావులుగా వాడుకుని బెదిరింపులు, దందాలకు దిగినట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ కౌన్సిలర్‌పై దాడి, అరెస్టు, ఆ తర్వాత రూరల్ మండలంలోని ఓ కాంగ్రెస్ నాయకుడిపై దాడి కూడా ఫోన్ ట్యాపింగ్ నేపథ్యంలోనే జరిగాయనే ప్రచారం ఉంది. కొంతమంది నాయకులు ఫోన్ ట్యాపింగ్‌ను ముందుగానే గుర్తించి.. ఫేస్‌టైమ్ ద్వారా మాట్లాడటమో లేక ఇతర వ్యక్తుల ఫోన్ల నుంచి మాట్లాడటమో చేస్తున్నారు. ఓ రకంగా పాలమూరు పట్టణంలో కొంతమంది ఫోన్‌లో మాట్లాడటానికి భయపడిన పరిస్థితులూ ఉన్నాయి. ఈ సీఐ ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి.. అప్పటి ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా ఎవరు పోస్టులు పెడుతున్నారు?, ఎవరు ఎవరితో మాట్లాడుతున్నారు?, ఏం మాట్లాడుతున్నారు?, ఎవరి ఇంటికి ఎవరు వెళ్తున్నారు?, ఎక్కడ ఎవరెవరు కలుస్తున్నారు? అనే విషయాలను ఎప్పటికప్పుడు చేరవేయడమే పనిగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులను వేధించడం వంటివి కూడా చేశారు. డబ్బులు కూడా భారీగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు వచ్చినా.. తమకోసం పని చేస్తున్నారనే కోణంలో సదరు పోలీసు అధికారుల తీరును పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

తీగ లాగుతారా?

ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో తీగ లాగితే డొంక కదిలిన విధంగా ఒక్కో అధికారి నిందితుడిగా తేలుతున్నారు. ఎవరో ఒకరు అప్రూవర్‌గా మారి.. నిజాలు వెల్లడిస్తే అప్పట్లో ఫోన్ ట్యాపింగ్‌లో భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, సహకరించిన సిబ్బంది మొత్తం ఊచలు లెక్కపెట్టే అవకాశాలు ఉంటాయి. అలాగే జిల్లా స్థాయిలో కూడా కీలకమైన అంశమే కావడంతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణను రోజూ ఫాలో అవుతున్నారు. దాంతో ఇక్కడ కూడా విచారణ పూర్తి స్థాయిలో చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అయితే అప్పటి సీఐకి నోటీసులు ఇవ్వడం ద్వారా జిల్లా స్థాయికి విచారణను షిఫ్ట్ చేస్తే.. ఆ తర్వాత ఎవరు భాగస్వాములుగా ఉన్నారు?, ఎవరి పాత్ర ఎంత?, ఎక్కడ సర్వర్ రూం ఏర్పాటు చేశారు?, ఎవరెవరి సంభాషణలు విన్నారు?, బెదిరింపుల వల్ల ఎంతమంది ఇబ్బందులు పడ్డారనే విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే అప్పట్లో ఆ సీఐకి ప్రభుత్వ పెద్దల సపోర్ట్ ఉండటంతో.. మిగతా పోలీసులు కూడా తను చెప్పినట్లే నడుచుకున్నారు. ఇప్పుడు వారికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం లేకపోలేదు. ఇందులో భాగస్వాములుగా ఉన్న కొంతమంది పోలీసు అధికారులకు ట్యాపింగ్ వ్యవహారం తెలియకపోయినప్పటికీ.. పరోక్షంగా ట్యాపింగ్ ద్వారా ఇబ్బంది పెట్టాలనుకునే వారి ఇళ్లపై దాడులు చేయడమో లేక వారిని అరెస్టు చేసి, అక్రమ కేసులు బనాయించడమో జరిగిందని తెలుస్తోంది. ప్రభాకర్ రావు లొంగిపోయిన తర్వాత అసలు కథ ప్రజాప్రతినిధులవైపు మళ్లే అవకాశం కచ్చితంగా ఉంది. ఇందులో కీలకంగా వ్యవహరించిన మాజీ ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

పది మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- 3 నుంచి 11వ తేదీ వరకు..
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో కేంద్రాల ఏర్పాటు



మహబూబ్‌నగర్‌లో పదో తరగతి పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు(ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 1: పదో తరగతి పరీక్షలు ముగియడంతో జవాబు పత్రాల మూల్యాంకనం కోసం విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. గత నెల 30న పరీక్షలు ముగియగా.. బుధవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు పేపర్లు దిద్దనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో గల మహబూబ్‌నగర్ గ్రామర్ హైస్కూల్‌లో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాలకు సంబంధించిన జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొననున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే మూల్యాంకనంలో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనున్నారు. మూల్యాంకనం కోసం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు.

కేంద్రాలకు చేరిన జవాబు పత్రాలు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో గల మహబూబ్‌నగర్ గ్రామర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో వివిధ జిల్లాలకు చెందిన జవాబు పత్రాలను చేర్చారు. జిల్లాకు రెండు లక్షల జవాబు పత్రాలను కేటాయించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ మూల్యాంకనం కేంద్రంలో గల స్ట్రాంగ్ రూంకు లక్షా 60 వేల జవాబు పత్రాలను చేర్చారు. పటిష్ట బందోబస్తు మధ్య జవాబు పత్రాల బార్ కోడింగ్ కొనసాగుతోంది.

ఉపాధ్యాయుల కేటాయింపు

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పది మూల్యాంకనం కేంద్రాల్లో పేపర్లు దిద్దేందుకు ఐదు జిల్లాలకు చెందిన దాదాపు 1,800 మంది ఉపాధ్యాయులకు ఉత్తర్వులు ఇచ్చారు. వీరితో పాటు జీహెచ్‌ఎంలను బార్ కోడింగ్ అధికారులుగా నియమించారు. మహబూబ్‌నగర్ మూల్యాంకనం కేంద్రంలో పేపర్లు దిద్దే అసిస్టెంట్ ఎగ్జామినర్లు(ఏఈ)గా 870 మందిని, ప్రతీ ముగ్గురు ఏఈలకు ఒక చీఫ్ ఎగ్జామినర్(సీఈ) చొప్పున 150 మందిని, పేపర్ దిద్దిన తర్వాత మార్కులు చెక్ చేయడానికి స్పెషల్ అసిస్టెంట్స్ 225 మందిని నియమించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 815 మందికి మూల్యాంకనం విధులు వేశారు. మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఉత్తర్వులు తీసుకున్న ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా మూల్యాంకనానికి హాజరు కావాలని మహబూబ్‌నగర్ డీఈవో ఎ.రవీందర్ ఆదేశించారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట/కొల్లాపూర్ ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి అభ్యర్థి మల్లు రవి విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షతన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూపల్లితో పాటు అభ్యర్థి మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కేసీఆర్ పదేళ్లుగా నియంత పాలన సాగించి, అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. ఆయనిచ్చిన వాగ్దానాలేవీ అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో అమలు చేశారన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చడానికి ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలింపించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. సమావేశంలో ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ జగదీష్ రావు, నాయకులు మోపతయ్య, రాజేందర్, గోపాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌వి తప్పుడు కూతలు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌వన్నీ పిట్ట కథలు, తప్పుడు కూతలేనని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అధికారం కోల్పోగానే మతిభ్రమించి అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ కమిటీ సభ్యుల సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారం కోల్పోగానే దిక్కుతోచక కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తూ రైతుల పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీగా మల్లురవిని రెండు లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిపించాలన్నారు. మల్లురవి మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథ్, ఓబీసీ సెల్ జాతీయ నాయకులు, తమిళనాడు రాష్ట్ర ఇన్‌చార్జ్ కేతూరి వెంకటేశ్, పార్టీ నియోజకవర్గ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, నాయకులు పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, రంగినేని జగదీశ్వరుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి అరుణ



డీకే అరుణను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

మిడ్జిల్(మహబూబ్‌నగర్), ఏప్రిల్ 1: ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెడుతున్నారని చెప్పారు. రుణామాఫీ, మహిళలకు ఇచ్చే భృతిపై కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని అన్నారు. సోమవారం మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీఎస్ గార్డెన్‌లో నిర్వహించిన మిడ్జిల్, ఊర్కొండ బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును విభజన చట్టంలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. అప్పుడు ఎంపీగా ఉన్న సీఎం రేవంత్ పాలమూరు-రంగారెడ్డి గురించి ఎందుకు మాట్లడలేదో ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలో తన పోరాటాల వల్లే నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ఎత్తిపోతల పథకాల వల్ల రైతులకు సాగునీరు అందించామన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్‌ను కేసీఆర్‌యే పెంచి సీఎం కుర్చీని వదులుకున్నాడన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిన, చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అంతకు ముందు నాయకులు అరుణను గజమాలతో సన్మానించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన మహేష్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను అరుణ పరామర్శించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఇన్‌చార్జీలు రాజేశ్వర్, జనార్దన్‌రెడ్డి, అధ్యక్షులు లాలు, అంజనేయులు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల ఏడున గిరిజన సైనిక స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 1 : తెలంగాణ గిరిజన సంక్షేమ సైనిక స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాల కోసం ఈ నెల ఏడో తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి కె.నాగార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు తీసుకోవాలన్నారు. ఈనెల ఏడున ఆరో తరగతికి సంబంధించి ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని వివరించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి మహబూబ్‌నగర్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు)లో పరీక్ష ఉంటుందని తెలిపారు.

నల్లమల అడవుల్లో చెలరేగిన మంటలు

- 50 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించిన మంటలు
- అదుపు చేసిన అటవీ శాఖ సిబ్బంది



మక్కలేరు వాగు సమీపంలో అంటుకున్న మంటలు

దోమలపెంట, ఏప్రిల్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అటవీ ప్రాంతం అమ్రాబాద్ అభయారణ్యం మన్ననూర్ రేంజ్ మక్కలేరు వాగు పరిసర ప్రాంతంలో సోమవారం మంటలు చేలరేగి సుమారు 50 ఎకరాల విస్తీర్ణం మేర అడవి అంటుకుంది. మంటలు క్రమంగా శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారి వరకు వ్యాపించడంతో దట్టమైన పొగలు రావడంతో రహదారి కన్పించక పోవడంతో వాహన దారులు ఇబ్బంది పడ్డారు. అటవీశాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించి ఎట్టకేలకు మంటలు అదుపు చేశారు. వారంరోజుల క్రితం వటువర్లపల్లి సమీపంలో కిన్నెర గుండం ఎల్లమాయకుంట, జువ్వికాలువ, ఎలుక పడెలు, జవుకులు తదితర ప్రాంతాల్లో మంటలు చేలరేగి చాలా ప్రాంతం అటవీ కాలి బూడిదైంది. ఈ విషయంపై మన్ననూర్ రేంజర్ ఈశ్వర్‌ను వివరణ కోరగా ఫరహాబాద్ సమీపంలోని కొంత అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించింది వాస్తవమేనని, తమ సిబ్బంది మంటలు అదుపు చేశారని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పెబ్బేరు, ఏప్రిల్ 1 : వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ పరిధిలో సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందింది. ఎస్సై సాయిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు పట్టణంలోని పాత చౌడేశ్వరి ఆలయ సమీపంలో సరస్వతి(29) ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందన్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడి

బిజినేపల్లి, ఏప్రిల్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశం పొందేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను జవహర్ నవోదయ విద్యాలయ సమితి విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆరవ తరగతిలో 80 సీట్లు, తొమ్మిదో తరగతిలో తొమ్మిది సీట్ల కోసం ప్రవేశపరీక్ష నిర్వహించామన్నారు. ఎంపికైన విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా విద్యాలయానికి రావల్సిన అవసరం లేదని, ఫోన్ నెంబర్లు, వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా సమాచారం అందించి అవసరమైన ఫారాలను పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే గిరిజన సంక్షేమం

» మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 : దేశంలో గిరిజన ఆదివాసి సంక్షేమానికి కృషి చేసింది కాంగ్రెస్ పార్టీనేనని ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చి రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఇందిరాగాంధీదేనని చెప్పారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఆదివాసి జిల్లా విభాగం అధ్యక్షుడు లింగంనాయక్ అధ్యక్షతన జరిగిన ఎస్టీ సెల్ పార్లమెంటరీ సమీక్ష సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. కాంగ్రెస్ మొదటి నుంచి గిరిజనుల పట్ల ప్రేమాభిమానాలు చూపించిందని, గిరిజనులు కాంగ్రెస్‌కు వెన్నంటే ఉన్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిందని, రాంమందిర్ విగ్రహ ప్రతిష్ఠలో రాష్ట్రపతి ముర్మును విస్మరించారని, పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి పిలువలేదని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో గిరిజనులంతా ఏకమై బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఆదివాసి అధ్యక్షుడు లింగంనాయక్ మాట్లాడుతూ ఈనెల మూడవ తేదీ నుంచి మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఆదివాసి కాంగ్రెస్ విజయ యాత్ర చేపడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికలో 80 శాతం గిరిజనులు కాంగ్రెస్‌కు మద్దతిచ్చి పార్టీ విజయంలో క్రియాశీలక పాత్ర పోషించారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే తరహాలో కాంగ్రెస్‌కు అండగా ఉంటామన్నారు. సమావేశంలో నాయకులు గోపాల్‌నాయక్, గంగ్యానాయక్, శేఖర్‌నాయక్, రవినాయక్, తులసీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నా రైతులను పలకరించ లేదు

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

వడ్డేపల్లి, ఏప్రిల్ 1 : అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ రైతులను పలకరించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లోని భవానీ ఫంక్షన్ హాల్‌లో ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్ పదవీ విరమణ కార్యక్రమానికి కోదండరాంతో పాటు, జడ్పీ చైర్‌పర్సన్ సరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ అధికారం ఏ పార్టీ సొత్తు కాదని, నాయకులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, ప్రధానోపాధ్యాయుడు కూడా రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవలందించాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ ప్రభుత్వపరంగా పదవీ విరమణ పొందినప్పటికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా కానీ రాజకీయాల్లోకి వచ్చి పదవులు పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం, ఎంపీపీ రజితమ్మ, జడ్పీటీసీ సభ్యుడు రాజు, పోచయ్య, జయచంద్రుడు, దేవన్న తదితరులు ఉన్నారు.

అమర్‌రాజా కంపెనీ కార్యకలాపాలు ఆపాలి

» డీజీపీకి అమర్‌రాజా వ్యతిరేక పోరాట సమితి ఫిర్యాదు


డీజీపీకి ఫిర్యాదు చేసిన అనంతరం బక్క జడ్సన్‌తో కలిసి అమర్‌రాజా వ్యతిరేక పోరాట సమితి నాయకులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 : మహబూబ్‌నగర్ సమీపంలోని ఎదిర-దివిటిపల్లి గ్రామాల శివారులో నిబంధనలు లేకుండా, ప్రజాభిప్రాయాలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడుతున్న అమర్‌రాజా పరిశ్రమ పనులను వెంటనే నిలిపి వేయాలని ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్, అమర్‌రాజా వ్యతిరేక పోరాట సమితి సభ్యులు సోమవారం రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఈ లిథియం పరిశ్రమపై ఇప్పటికే రాష్ట్ర గవర్నర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బోర్డుకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ పరిశ్రమపై ప్రజల్లో పలు సందేహాలున్నాయని వాటిని నివృత్తి చేయాలని కోరారు. ఏజెన్సీ నుంచి పబ్లిక్ రిపోర్టుతో స్థాపించబడే ఫ్యాక్టరీకి ఎన్‌జీటీ నుంచి క్లియరెన్స్, పరిశ్రమ యొక్క బ్లూప్రింట్, దాని తయారీ ఉత్పత్తులు, భద్రతా చర్యలు, ఫ్యాక్టరీ నుంచి వెలువడే ప్రమాదకర వ్యర్థాలు, ఏపీలోని చిత్తూరులో ఈ ఫ్యాక్టరీని ఎందుకు అనుమతించలేదు, భోపాల్, విశాఖపట్నం గ్యాస్ లీకేజీ దుర్ఘటనల విపత్తులను ఈ ఫ్యాక్టరీ ఎలా తట్టుకోగలదో వంటి సందేహాలు ప్రజల్లో ఉన్నాయన్నారు. అందుకే ఈ ఫ్యాక్టరీ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయించాలని కోరారు. కార్యక్రమంలో అమర్‌రాజా వ్యతిరేక పోరాట సమితి నాయకులు తిరుపతిరెడ్డి, తోకల కృష్ణయ్య, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్, వకేశ్, మహబూబ్‌నగర్ అభివృద్ధి ఫోరం చైర్మన్ మున్నూరు రవి పాల్గొన్నారు.

నల్లమలలో వేటకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులపై కేసు

» ఉచ్చులు బిగిస్తూ, చెట్లు కొడుతూ పెట్రోలింగ్ పార్టీకి పట్టుబడిన దుండగులు


వేటకు వచ్చిన నిందితులతో అటవీ పెట్రోలింగ్ బృందం

మన్ననూర్, ఏప్రిల్ 1 : అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో వేట కోసం వచ్చిన ఇద్దరు వ్యక్తులను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ రేంజ్ పరిధిలోని ఫరహాబాద్ దృశ్య కేంద్రం వద్ద ప్రత్యేక అటవీ పెట్రోలింగ్ బృందం సోమవారం తనిఖీలు చేస్తున్న క్రమంలో వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు అడవిలో ఉచ్చులు బిగిస్తూ తారసపడ్డారు. ఇదే క్రమంలో పెద్ద టేకు చెట్లను నరికి విలువైన కలపను రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దుండగులను పట్టుకొని పెట్రోలింగ్ బృందం విచారణ చేయగా బల్మూరు మండలం బాణాలకు చెందిన రాత్లావత్ బిక్య, రామావత్ బాల్యలుగా గుర్తించారు. అడవిలోనే పంచనామా చేసిన పెట్రోలింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్న కలప, ఉచ్చులతో పాటు నిందితులను మన్ననూరు అటవీ రేంజ్ అధికారి కార్యాలయానికి తరలించారు. రాత్లావత్ బిక్య, రామావత్ బాల్యలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మన్ననూరు రేంజ్ అధికారి ఈశ్వర్ తెలిపారు. నల్లమలలో అటవీ అనుమతులు లేకుండా సంచరించడం నేరమని, అడవిలో చెట్లు నరకడం, ఉచ్చులు బిగించడం వంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై వైల్డ్‌లైఫ్ చట్ట ప్రకారం కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో మన్ననూరు రేంజ్ డీఆర్వో రవికుమార్, బీట్ అధికారులు మధుసూదన్, ఆనంద్‌కుమార్, బేస్ క్యాంపు వాచర్లు, ఫైర్ వాచర్లు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్స్ విధానం - సుప్రీం కోర్టు తీర్పుపై
5న రౌండ్ టేబుల్ సమావేశం

పాలమూరు, ఏప్రిల్ 1 : ఎలక్టోరల్ బాండ్స్ విధానం - సుప్రీం కోర్టు తీర్పు, పర్యావసనంపై ఈనెల ఐదో తేదీన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం (షోయబ్‌హాల్)లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ గొప్ప విధానమని, నల్లధనం నివారణకు ఈ బాండ్స్ తోడ్పడుతాయని, రాజకీయ అవినీతిని ఆపుతుందని బీజేపీ ప్రభుత్వం ప్రచారం చేసిందన్నారు. ప్రజాస్వామికవాదులు, ప్రతిపక్ష పార్టీలు ఇది అవినీతి కేంద్రీకరణ విధానమని ఎంత వ్యతిరేకించినా అది అక్కరకు రానిదే అయిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు తరువాత ఎలక్టోరల్ బాండ్స్ విధానం అధికార పక్ష అవినీతిని ఒక పద్ధతిగా వ్యవస్థీకృతం చేసిన తీరు, రాజకీయార్థిక నేరాలను, విలువల పతనాన్ని వేగవంతం చేసిన తీరు బట్టబయలైందన్నారు. ఇది అనేక నేరాలకు మాస్టర్ మార్గం అని ప్రజలకు అర్థమైందన్నారు. ప్రజలకు ఈ చర్చ నుంచి దారి మళ్లించడానికే కేంద్ర ప్రభుత్వం తన చేతిలోని ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగిస్తున్నదని, అందులో ఎస్‌బీఐని కూడా వీటికి తోడు చేసిందన్నారు. రాజకీయాలు, రాజకీయాల్లో విలువల పతనానికి ప్రభుత్వాలే మునుపెన్నటికన్నా తప్పుడు విధానాలు అమలు తేవడం పెరిగిందన్నారు. ఇది ప్రజలకు, ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి, అణిచివేతకు దగ్గర దారి అన్నారు. ఈ అంశాన్ని లోతుగా చర్చించటానికి ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి మిత్రులందరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. వీక్షణం, పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ డీఎస్, ఎస్.వేణుగోపాల్, ప్రొఫెసర్ పాపారావు, ప్రొఫెసర్ వీఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ ఎం.కోదండరాం, ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ఐఏఎస్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్ జి.లక్ష్మీనారాయణ, డా.ప్రొఫెసర్ జి.విజయ్, గోవర్ధన్, కన్నెగంటి రవి, అంబటి నాగయ్య, బి.లక్ష్మయ్య, డి.చంద్రశేఖర్, డా.వనమాల తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, ఏప్రిల్ 1 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... కోడేర్ మండలం ఖైలారం గ్రామానికి చెందిన నల్వాల చిన్నస్వామి(37) మండల కేంద్రంలో సెంట్రింగ్ పని చేస్తు తన అక్క ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తుండేవాడు. చిన్నస్వామి భార్య తన అక్క కూతురు పెళ్లి కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. మృతుడు కొన్ని నెలల నుంచి తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు. ఎన్ని ఆసుపత్రులు చూపించినా కడుపునొప్పి తగ్గకపోవడంతో ఆ బాధతో తాగుడుకు బానిస అయ్యాడు. తాగిన మైకంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం తెల్లవారినా తలుపులు తెరవకపోవడంతో ఇంటి పక్కల ఉన్న శ్రీకాంత్ కిటికీలో నుంచి చూడగా మృతుడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గద్వాల, ఏప్రిల్ 1 : పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్సై పర్వతాలు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని మేలచెరువు గ్రామానికి చెందిన ఎంబడి లక్ష్మన్న(61) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గత నెల 29వ తేదీన వ్యవసాయం పొలం వద్ద లక్ష్మన్న పురుగుల మందు తాగా డు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కర్నూల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు భీమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి అదృశ్యం


మనోహర్ (ఫైల్)

అలంపూర్, ఏప్రిల్ 1 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన బోయ మనోహర్ అదృశ్యమైనట్లు అతని తండ్రి మద్దిలేటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మనోహర్ ఇటీవలే మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవపడుతుండేవాడని, ఈ విషయమై గతనెల 28న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ దొంగకు రిమాండ్

వడ్డేపల్లి, ఏప్రిల్ 1 : దుకాణాల ముందు ఉంచిన బైక్‌లను అపహరించే దొంగను అరెస్టు చేసి సోమవారం అలంపూర్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించినట్లు శాంతినగర్ ఎస్సై సంతోష్ తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా అయి జ పట్టణానికి చెందిన నవీన్‌కుమార్ గతనెల 29వ తేదీన ఉదయం కొంకల గ్రామానికి వెళుతూ మార్గమధ్యలో కొంకల స్టేజీ వద్ద బైక్ నిలిపి టిఫిన్ సెం టర్‌లో టిఫిన్ చేసిన తర్వాత వచ్చి చూడగా తన బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని గ్రహించి అతను శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో శాంతినగర్ పట్టణంలోని రాఘవేంద్ర బైక్ మెకానిక్ షాప్‌కు ఓ వ్యక్తి బైక్‌ను తీసుకువచ్చి రూ.10వేలకు అమ్మేందుకు ప్రయత్నించాడు. అనుమానం వచ్చిన మెకానిక్ తమకు సమాచారం ఇవ్వగా బైక్ దొంగను పట్టుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకుని విచారించామన్నారు. విచారణలో రాయచూర్ జిల్లా ఎరి గేర మండలం, ఐజాపురం గ్రామానికి చెందిన కుర్వ వీరేష్(26)గా గుర్తించామ న్నారు. మద్యానికి బానిసైన కుర్వ వీరేష్ రోడ్ల మీద తిరుగుతూ, బస్టాండ్‌లో నిద్రిస్తూ ఉండేవాడన్నారు. ఏదైనా కూలీ పని దొరికితే పనికి, లేకపోతే ఎవ రూ లేనిచోట బైక్ దొంగతనాలకు పాల్పడేవాడు. గత సంవత్సరం గద్వాల పట్టణంలో, ఈ సంవత్సరం అయిజ పట్టణంలో ఇదే తరహా బైక్ దొంగతనాలకు పాల్పడగా ఆయా పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు అయ్యాయని ఎస్సై వివరించారు.

పోలీసుల తనిఖీల్లో మద్యం పట్టివేత


బైరాపురం చౌరస్తాలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మద్యం

ఉండవల్లి/ధరూరు/లింగాల, ఏప్రిల్ 1 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం వేర్వేరు చోట్ల పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం పట్టుబడింది. వివరాల్లోకి వెళితే.. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం బైరాపురం చౌరస్తాలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా మద్యాన్ని పట్టుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం బైరాపురం చౌరస్తాలో ఎస్సై శ్రీనివాసులునాయక్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహన తనిఖీలు చేపట్టింది. బస్వాపురం గ్రామానికి చెందిన శ్రీహరి కిరాణం షాపు యజమాని ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీల్లో పట్టుకున్నారు. ఆటోలో 99.840 లీటర్ల మద్యం ఉందని, వాటి విలువ రూ.50,980 ఉంటుందన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని, ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ పరమేష్, కిరాణం షాపు యజమాని శ్రీహరిపై ఎస్సై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అదేవిధంగా, ధరూరు మండలం మన్నాపురం గ్రామంలో కిరాణం దుకాణంలో మద్యాన్ని అమ్ముతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భీమన్న కిరాణం దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అనుమతి లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్నాడని తమకు వచ్చిన సమాచారంతో దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. కిరాణం దుకాణంలో 9.1 లీటర్ల మద్యాన్ని గుర్తించామని, దీని విలువ సుమారు రూ.2,275లుగా ఉన్నట్లు తెలిపారు. భీమన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలోని ఓ బెల్టుషాపుపై పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామంలోని వెంకటస్వామి అనే వ్యక్తికి చెందిన బెల్టుషాపులో రూ.ఆరు వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రాజోలి, ఏప్రిల్ 1 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్ర శివారులోని తుంగభద్ర నదిలో నుంచి ఇసుకను తరలించేందుకు వెళ్తున్న ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ తెలిపిన వివరాలు ప్రకారం.. తుంగభద్ర నదిలో నుంచి ఇసుక తరలించేందుకు వెళ్తున్నారని తమకొచ్చిన సమాచారంతో సోమవారం తెల్లవారుజామున నది తీరంలో తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీలో అనుమతులు లేకుండా నదిలోకి దిగుతున్న ఐదు ట్రాక్టర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను గుర్తించి, వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఖాళీ ట్రాక్టర్లు దొరకడంతో ఒక్కో వాహనానికి రూ.వెయ్యి చొప్పున జరిమానా వేసి వదిలేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

బల్మూరు : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం బిల్లకల్ గ్రామంలో ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండల్ అనే వ్యక్తి తన సొంత ట్రాక్టర్‌లో అడవి సమీపంలోని ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకొని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇసుక ట్రాక్టర్ పట్టుకోవడంలో సిబ్బంది హరికృష్ణ, శంకర్ నాయక్, భీమ్లానాయక్‌లు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

జడ్చర్లలో ఇసుక టిప్పర్లు

మిడ్జిల్(మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను ఎస్సై శివానందగౌడ్ పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు సీఐ ఆదిరెడ్డి సోమవారం తెలిపారు. మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి గ్రామ శివారులో డంపు చేసిన ఇసుకను జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి పేరుతో తరలిస్తు జిల్లా కేంద్రానికి తరలించకుండా తప్పుడు వేబిల్లులతో జడ్చర్లలో ఖాళీ చేస్తున్న ఐదు ఇసుక టిప్పర్లను ఎస్సై శివానంద్‌గౌడ్ పట్టుకొని స్టేషన్ తరలించి, మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ వివరిం చారు.

వ్యవసాయ మోటార్ల వైరు చోరీ

పీపనగండ్ల, ఏప్రిల్ 1 : వనపర్తి జిల్లా పీపనగండ్ల మండల కేంద్రంలో వ్యవసాయ మోటార్ల విద్యుత్ వైరు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ పొలాల్లో స్టార్టర్ నుంచి మోటర్ వరకు వైర్లను కట్ చేసి తీసుకువెళ్తున్నారని బాధితులు మహేష్, బాబుజీగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కల్వరాల గ్రామంలో కురుమయ్యకు చెందిన ఐదు పైపులు పోయాయని తెలిపారు. రైతుల కష్టాలను దోచుకోవడం దారుణమని వాపోయారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుంటే ఆ ప్రాంత ఇతర రైతులకు వెంటనే తెలియజేయాలని కోరారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి, శిక్షించాలని రైతులు అధికారులను కోరారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభం



గణపతి పూజలో పాల్గొన్న భక్తులు

చారకొండ, ఏప్రిల్ 1: మండల పరిధిలోని శాంతిగుడెంలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యావాచనము, పంచంగ వ్యాపాసనం, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, మూలమం త్ర హోమాలు, దేవతా హోమాలు, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు దేవాలయ కమిటీ సభ్యులు, భక్తబృందం కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలిసారిగా శాంతిగుడెంలో గ్రామస్థులు నూతనంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తుండడంతో గ్రామస్థులు తమ బంధువులను పిలిపించుకోవడంతో గ్రామంలో పండుగ వాతవరణం ఏర్పడింది.

అంగన్‌వాడీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి



డీటీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. ఈశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు

కొల్లాపూర్, ఏప్రిల్ 1 : కొల్లాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చింతలపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు భారతి, సుగుణలను అక్రమంగా విధుల నుంచి తొలగించారని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటి వరకు అన్ని పనులు తప్పకుండా నిర్వహిస్తున్నప్పటికీ జీవో 14ఆధారం చేసుకుని వెంటనే మూడు మెమోలు ఇచ్చి వీరి పని సక్రమంగా లేదని చెబుతూ ఎలాంటి ఆధారం లేకుండా అక్రమంగా తొలగించారన్నారు. ఎలాంటి విచారణ లేకుండా రాజకీయ కక్షలతో వీళ్లను తొలగించడం దుర్మార్గమని అన్నారు. రాజకీయ నాయకులు వారు తమ రాజకీయాలను చూసుకోవాలి తప్ప ఇలాంటి చిన్న ఉద్యోగులపై కక్షలు పెంచుకుని ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయించడం దుర్మార్గమన్నారు. కొల్లాపూర్ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకుని వారిని వెంటనే విధుల్లోకి తీసుకునే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నాయకుల వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీటీకి అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ పెంట్లవెల్లి సెక్టార్ అధ్యక్షురాలు రమాదేవి, పద్మ, సువర్ణ, రామచంద్రమ్మ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జూపల్లి రైతు వేదికలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

చారకొండ, ఏప్రిల్ 1: మండల పరిధిలోని జూపల్లి రైతువేదికలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని కల్వకుర్తి డివిజన్ సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాసులు, సెంటర్ పర్యవేక్షకులు సుక్తదీర్ ప్రారంభించారు. ఈసందర్భంగా పీఏసీఎస్ సీఈవో వెంకటయ్య మాట్లాడుతూ చారకొండ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా జూపల్లిలో 2024-25 యాసంగి(రబీ) వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ క్వింటాల్ వడ్లకు రూ.2203, బీ గ్రేడ్ క్వింటాల్ వడ్లకు రూ. 2,183కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమవెంట ఆధార్ కార్డు, పట్టా పాసుబుక్కు జిరాక్స్‌లను తప్పనిసరిగా తెచ్చుకోవాలని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈవో సుష్మ, వడ్ల కొనుగోలు కేంద్రం సెంటరు ఇన్‌చార్జి భీమయ్యగౌడ్, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై అవగాహన



మంగనూర్‌లో పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

బిజినేపల్లి, ఏప్రిల్ 1 : పంటల సాగుకు ముందు పచ్చి రొట్ట ఎరువుల వినియోగంతో రైతులకు అధిక దిగుబడులు పొందవచ్చని రావేఫ్ విద్యార్థినులు అవగాహన కల్పించారు. మండలంలోని మంగనూర్‌లో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతులకు పచ్చిరొట్ట ఎరువుల రకాలను, వాటి నుంచి పంటలకు అందే పోషక విలువలను రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో నేలకు ఎక్కువ పోషకాలను పచ్చిరొట్ట ద్వారా అందించవచ్చన్నారు. జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అలసంద వంటి పైర్లను మొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియ దున్నడాన్ని పచ్చిరొట్ట ఎరువుగా పరిగణిస్తారని తెలిపారు. వీటి వేరులలోని బుడిపెల్లో నత్రజని శాతం అధికంగా ఉండడంతో నేలకు అవసరమైన పోషకాలు పుష్కలంగా పెరుగుతాయని వివరించారు. నేల పునర్జీవింపు సేంద్రియ ఎరువుల్లో భాగంగా పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం పంటల సాగులో వినియోగించాలని తెలిపారు. రావేఫ్ విద్యార్థినులు వైష్ణవి, ప్రణయ, వైష్ణవి రెడ్డి, నివేదిత, నిహారిక ఉన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన ఏఆర్ డీఎస్పీ

చారకొండ, ఏప్రిల్ 1: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఏఆర్ డీఎస్పీ నర్సింహచారి సందర్శించారు. ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలని అన్నారు. ఎన్నికల కోడ్‌ను ఎవరైన ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది బాధ్యతహితంగా పని చేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు తమ వెంట నగదును, ఇతర విలువైన వస్తువులను తీసుకెళ్తే సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. వాహనదారులు రూ. 50 వేల కంటే మించి తీసుకెళ్తే అందుకు ఆధారాలు చూపించాల్సిన అవసరం వుంటుందని ఆయన పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను పీవో, ఏపీవోలు సమర్థవంతంగా నిర్వహించాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 1 : పార్లమెంట్ ఎన్నికలను పీవో, ఏపీవోలు సమర్థవంతంగా నిర్వహించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.శ్రీను కోరారు. కల్వకుర్తి పట్టణంలోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి బీఈడీ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై 352పీవో, ఏపీవోలకు మొదటి శిక్షణ కార్యక్రమం ఏఆర్‌వో, ఆర్డీవో ఎస్.శ్రీను ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏఎల్‌ఎంటీ, డీఎల్‌ఎంటీలు ఎలక్షన్ నిర్వహణకు సంబంధించిన అంశాలు, ఈవీఎం, వీవీప్యాట్లపై శిక్షణనిచ్చారు. అనంతరం అందరి వద్ద నుంచి ఫామ్-12ను పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కోసం తీసుకోవడం జరిగిందని ఆర్డీవో ఎస్.శ్రీను తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ అనిత, పీవో, ఏపీవోలు ఉన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

తెలకపల్లి, ఏప్రిల్ 1 : మండల పరిధిలోని తాళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం 33కేవీ లైన్ కింద చెట్లు కొట్టడం జరుగుతుందని సాయంత్రం 5గంటల నుంచి 6గంటల మధ్యలో తాళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ అధికారులు తెలిపారు. వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

వెల్దండ, ఏప్రిల్ 1 : మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు దివంగత పబ్బు జంగయ్యగౌడ్ స్మారకార్థంగా అంబలికేంద్రం ప్రారంభమయ్యింది. జంగయ్యగౌడ్ కుమారుడు ఎంపీటీసీ సభ్యుడు పబ్బు చక్రవర్తి గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరితో కలిసి కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్స్

- కల్వకుర్తిలో ఎస్ఐ, సీఐ క్వార్టర్స్ దుస్థితి
- వంగూరు ఎస్ఐ క్వార్టర్‌లో పోలీస్‌స్టేషన్ నిర్వహణ
- పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉంటే సత్వర సేవలు



కల్వకుర్తిలో శిథిలావస్థకు చేరిన ఎస్ఐ క్వార్టర్స్

కల్వకుర్తి, ఏప్రిల్ 1 : శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులదే క్రియాశీల పాత్ర. 24గంటలు అందుబాటులో ఉండి సేవలందించే వృత్తిలో ఉన్న ఎస్‌హెచ్‌వోలకు, సిబ్బందికి నివాస గృహాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు కల్వకుర్తి డీఎస్పీ పరిధిలో కల్వకుర్తి వంగూరు, ఊర్కొండ, చారకొండ, వెల్దండ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రమైన కల్వకుర్తిలో ఎస్‌హెచ్‌వో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు ఏళ్ల క్రితం నిర్మించిన నివాస గృహాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో అక్కడ ఉండడానికి వీలుపడకపోవడంతో బయట అద్దెకు రూములు తీసుకుని ఉండాల్సిన దుస్థితి నెలకొంది. గత పది సంవత్సరాలుగి ఇదే పరిస్థితి కొనసాగుతుంది. వంగూరు పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరడంతో ఎస్ఐ నివాస గృహంలో స్టేషన్‌ను నిర్వహిస్తున్నారు. దీంతో వసతులు లేక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వెల్దండ పోలీస్‌స్టేషన్ మినహా నూతనంగా ఏర్పాటు అయిన చారకొండ మండలంలో ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో పోలీస్‌స్టేషన్ కొనసాగుతున్నది. ఊర్కొండ మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. కల్వకుర్తికి పోలీస్‌సబ్ డివిజన్ కేంద్రం మంజూరు కావడంతో కల్వకుర్తి సీఐ కార్యాలయంలోనే డీఎస్పీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. సీఐ కార్యాలయం ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌లో కొనసాగుతుంది.



చారకొండలోని ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

సిబ్బంది క్వార్టర్లు సైతం

కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వంగూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్మించిన పోలీస్ సిబ్బంది క్వార్టర్స్ అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో పోలీస్ సిబ్బంది ఉండడానికి ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

● పక్కా భవనాల నిర్మాణం జరిగేనా?

పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించడం, ఎక్కడ ఏ ఇబ్బంది తలెత్తినా వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను పరిష్కరించే ఎస్ఐలు, సీఐలకు పోలీస్ ఆవరణలో నివాస గృహాలు ఉండాల్సినవసరం ఉంది. ప్రభుత్వం క్వార్టర్స్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిర్మాణాలు చేపట్టి వసతులు కల్పిస్తే వారు 24గంటలు అందుబాటులో ఉండడంతో సత్వర సేవలకు అవకాశం ఉంటుంది.

పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తా



కల్వకుర్తి ఎస్‌హెచ్‌వో, సీఐ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. డివిజన్ పరిధిలో సిబ్బంది, క్వార్టర్స్ నూతన పోలీస్‌స్టేషన్లకు పక్కా భవనాల నిర్మాణాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- కల్వకుర్తి డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు

నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని, నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వరి ధాన్యం కొనుగోలు, వేసవి ఉష్ణోగ్రతలు, తాగునీటి సరఫరా ప్రణాళిక, పాఠశాలల నిర్వహణ, పనులపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, రెవెన్యూ కే.సీతారామారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు, నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, వేసవి వడదెబ్బ తగలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ నీటి సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. తాగునీటి పైపులైన్ లేని చెంచుగూడెల ప్రదేశాల్లో ట్యాంకర్ సహాయంతో నీటి సరఫరా అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు ముందే గ్రామాల వారిగా సమీక్షించుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్లు, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రానున్న నాలుగు రోజుల్లో ధాన్యం కేంద్రాలను ప్రారంభించడానికి సిద్ధం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సివిల్ సప్లయ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో సుధాకర్ లాల్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్, మిషన్‌భగీరథ ఈఈలు సుధాకర్‌సింగ్, శ్రీధర్‌రావు, డీఈవో గోవిందరాజులు, డీఎస్‌వో స్వామికుమార్, డీఎం సివిల్ సప్లయ్ బాలరాజు, మార్కెటింగ్ అధికారిణి బాలమణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలి

పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగినందున వడదెబ్బ తగలకుండా ప్రతీ ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ ప్రభావాలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, మండల ప్రత్యేక అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి కూలీలను ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు పని కల్పించాలని, అంగన్‌వాడీ టీచర్లకు సన్‌స్ట్రోక్‌పై అవగాహన కల్పించాలని, 108వాహనం అందుబాటులో ఉండాలని, పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు.

● లింగ నిర్ధారణకు పాల్పడితే కేసులు

లింగ నిష్పత్తిలో అసమానతలను తొలగించి సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు అందరూ కృషి చేయాలని, లింగ వివక్ష చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఐడీవోసీ సమావేశ మందిరంలో పీసీపీఎన్‌డీటీ(గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలన), డిస్ట్రిక్ట్ లెవల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ(డీఎల్‌ఎంఎంఏఏ) జిల్లా స్థాయి కమిటీపై వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిష్పత్తిలో అసమానతలను తొలగించి సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై చట్టపరమైన శిక్షలు అమలు చేయాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. యాక్టును అతిక్రమిస్తే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవన్నారు. అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, డీఎంహెచ్‌వో సుధాకర్ లాల్, చైల్డ్‌ప్రొటెక్షన్ లక్ష్మణరావు, ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు కోసం అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 1: వందశాతం ఓటు నమోదు చేసేలా స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వీప్ కోర్ కమిటీతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో స్వీప్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువత వంద శాతం ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటు హక్కు నమోదు తక్కువగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందని, వాటిని అధిగమించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం చేయాలని ఆదేశించారు. స్వీప్ నోడల్ అధికారి చిన్న ఓబులేష్, జడ్పీ సీఈవో దేవ సహాయం, డీఈవో గోవిందరాజులు, డీపీవో కృష్ణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు



పెంట్లవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డు అయిన ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈవో గోవిందరాజులు

పెంట్లవెల్లి, ఏప్రిల్ 1 : ప్రతి ప్రభుత్వ ఉద్యోగస్తునికి పదవీ విరమణ అనేది తప్పదని డీఈవో గోవిందరాజులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు బలరామ కృష్ణారావును డీఈవో గోవిందరాజులు ఘనంగా శాలువాతో సన్మానించారు. పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రావు, ఉపాధ్యాయులు సీవీ.రావు, నరసింహ, అర్జున్‌గౌడ్, జగన్మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

వెల్దండ, ఏప్రిల్ 1 : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈవో శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన తలారి వెంకటయ్యకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వెంకటయ్యను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ పదవీ విరమణ కేవలం చేస్తున్న వృత్తికి మాత్రమేనని, విరమణ అనంతరం సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటయ్య పాఠశాల అభివృద్ధికి 10వేలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రుడు, జైపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగభూషణం, చిన్నయ్య వనజ, జహంగీర్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కల్పించాలి

ఉప్పునుంతల, ఏప్రిల్ 1: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని చేసే ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో ఆయన ఉపాధిహామీ కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో టెంటు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ కల్పించాలని ఆయన ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరానికి ఒక కూలికి 200 రోజులు పనులు కల్పించాలన్నారు. రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గత రెండు మూడు నెలల నుంచి కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని, తక్షణమే అధికారులు స్పందించి వెంటనే డబ్బులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు నాగరాజు, రాములు, సాయిలు, అర్జున్, నిరంజన్, శ్రీనివాసులు, తిరుపతయ్య సాయిబాబు, శ్రీకాంత్, సత్యనారాయణ, రాజు, భీమయ్య, ఆనంద్, కురవమ్మ, బాలమణి, ఇందిరమ్మ, నిరంజనమ్మ, చెన్నమ్మ, శివరాణి, తదితరులు ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అమ్రాబాద్, ఏప్రిల్ 1: పదర మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వినోద్ అనే యువకుడిపై పోక్సో యాక్ట్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పదర ఎస్ఐ రాజు సోమవారం తెలిపారు. యువకుడు అదే గ్రామంలో ఓ మైనర్ బాలికను ప్రలోభానికి గురి చేసి అసభ్యంగా వ్యవహరిస్తున్న విషయాన్ని గమనించిన బాలిక తల్లి మందలించింది. దీంతో ఆ యువకుడు ఆమెపై దాడికి యత్నించాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు వెల్లడించారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంట్ దాడులు

» మూడు కేసులు నమోదు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మారేడుమానుదిన్నెతండా, చంద్రబండతండాల్లోని సారా స్థావరాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంట్, డీటీఎఫ్ అధికారులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆయా తండాల్లో అధికారులు దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 1800 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసి, మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, డీటీ ఎఫ్ సీఐ కల్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

చారకొండ, ఏప్రిల్ 1:మండల పరిధిలోని మర్రిపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హజరై నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జర్పటి కొండల్, ఉపాధ్యక్షులుగా నూనే విష్ణు, ద్యాప కృష్ణారెడ్డి, గ్రామ కమిటీ ఇన్‌చార్జిగా అంగోత్ రాజునాయక్, ప్రధాన కార్యదర్శిగా నూనే శ్రీనయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నూనే బాలకృష్ణ, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడిగా నూనే రాజు, ఉపాధ్యక్షులుగా అంగోత్ లాలునాయక్, జర్పటి యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా గుర్రాల కిరణ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నూనే చంద్రయ్య వరిక్పుల మల్లేష్, నూనే శ్రీశైలం, అంగోత్ రాజేష్, గండికోట తిరుపతి, జాకటి ప్రశాంత్, నూనే రమేష్, నూనే సతీష్, వరిక్పుల శ్రీకాంత్, గండికోట రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చారకొండ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, రాజు, విష్ణు, బాలకృష్ణ, వెంకటయ్య, మల్లేష్, పాండు, బిట్ల విజయ్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థి హరీశ్

లింగాల, ఏప్రిల్ 1: మండల పరిధిలోని దత్తారం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి హరీశ్ సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నస్రీన్ బేగం తెలిపారు. మంగళవారం విద్యార్థితో పాటు విద్యార్థి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ గత నెల 10న నిర్వహించిన అర్హత పరీక్షలో పాఠశాలకు చెందిన విద్యార్థి హరీష్ కరీంనగర్ రుక్మాపూర్‌సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి సైనిక్ స్కూల్‌కు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుడు విద్యాసాగర్, గ్రామ మాజీ సర్పంచ్ జంగమ్మ, సాయిలు, లక్ష్మీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఉపాధి' సద్వినియోగం చేసుకోవాలి

లింగాల, ఏప్రిల్ 1: గ్రామాల్లో అమలవుతున్న ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆంజనేయులు కూలీలను కోరారు. సోమవారం మండల పరిధిలోని అవుసలికుంట గ్రామ శివారులోని చెరువుల్లో నుంచి వండ్రుమట్టి తరలించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ఉదయం సమయంలో మాత్రమే ఉపాధి పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. ముఖ్యంగా పని ప్రదేశంలో తప్పకుండా తాగునీరు తీసుకెళ్లాలని కోరారు. జాబ్‌కార్డు లేని వారికి జాబ్‌కార్డు కల్పించి ఉపాధి హామీ పథకంలో ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రేపు పాలిసెట్ ఉచిత మెరిట్ టెస్టు

కొల్లాపూర్, ఏప్రిల్ 1 : కొల్లాపూర్ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీన పాలిసెట్ ఉచిత కోచింగ్‌కు అర్హులయ్యేందుకు మెరిట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు కోసా ప్రధాన కార్యదర్శి శశికాంత్ వాల్మీకి పేర్కొన్నారు. 3వ తేదీన ఉదయం 9గంటలకు కొల్లాపూర్ పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించే ఉచిత మెరిట్ టెస్టుకు విద్యార్థులు హాజరు కాగలరని మెరిట్ టెస్టులో అర్హత సాధించిన విద్యార్థులకు ఉచిత పాలిసెట్ కోచింగ్, ఉచిత మెటీరియల్, ఉచిత హాస్టల్‌వసతి కల్పించనున్నట్లు శశికాంత్‌వాల్మీకి తెలియజేశారు.

గుండె పోటుతో కూలీ మృతి

ఊర్కొండ, ఏప్రిల్ 1: గుండె పోటుతో కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి మండలంలోని ఎలికట్ట గ్రామానికి చెందిన రైతు మండల కేంద్రంలో కల్వకుర్తి- జడ్చర్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న భూమి కౌలుకు తీసుకొని జీవనోపాధి పొందుతున్నారు. వరి చేను కోతకు రావడంతో సోమవారం హార్వెస్టర్ (వరికోత మిషన్)తో కోస్తుండగా పనులు చేయడానికి ఎలికట్ట గ్రామానికి చెందిన చిన్న పాపయ్య (45) అనే వ్యక్తి కూలికి వచ్చాడు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం తోటి కూలీలతో ఎదలో నొప్పి వస్తున్నదని చెబుతూ కూర్చున్న చోటే కుప్ప కూలిపోయాడన్నారు. దాంతో తోటి కూలీల కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎలికట్టకు తీసుకువెళ్లారని తెలిపారు.

'ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మనుగడ ప్రశ్నార్థకం'

వంగూరు, ఏప్రిల్ 1: పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మనుగడ ప్రశ్నార్థకమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నపుడు రైతుల ఇబ్బందులను పట్టించుకోని కేసీఆర్ ఓడిపోగానే రాజకీయ లబ్ధికోసం పొలం బాట పట్టారని విమర్శించారు. గత పదేళ్ల కాలంలో మార్కెట్లలో ధాన్యం తడిసి ముద్దయినా, వరదలకు పంటలు నష్టపోయి రైతులు ఇబ్బందులు పడినా పట్టించుకోని కేసీఆర్ విపక్షంలోకి వచ్చిన తరువాత రైతులు గుర్తుకొచ్చారని ప్రశ్నించారు.

స్వచ్ఛభారత్‌లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 1 : కల్వకుర్తి పట్టణంలో స్వామివివేకానంద సేవా బృందం, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారం ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడారు. సేవా బృందం సభ్యులు చింటూ, గౌతమ్, హర్షిత్, ఆశు, చందు, సాయి పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 14 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 1 : జిల్లా పోలీస్ సముదాయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. తగు న్యాయం గురించి ఐదు ఫిర్యాదులు, భూమి పంచాయతీలకు సంబంధించి ఆరు, భార్యభర్తల గొడవలకు సంబంధించి మూడు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

పూరి గుడిసె దగ్ధం

కోడేరు, ఏప్రిల్ 1: మండల పరిధిలోని నాగులపల్లితండాలో విద్యుదాఘాతంతో నివాస పూరి గుడిసె పూర్తిగా అగ్నికి ఆహుతి అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం... నాగులపల్లితండాకు చెందిన రాత్లావత్ చంద్రుకు సంబంధించిన నివాస పూరి గుడిసె ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గుడిసె పూర్తిగా కాలి బూడిదైంది. పక్కన ఉన్న మేకల కొట్టంకు కూడా మంటలు వ్యాపించి అందులో ఉన్న నాలుగు మేక పిల్లలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. పక్కనే ఉన్న గ్రామ పంచాయతీ బోరు నీటిని పైపుల ద్వారా చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. గుడిసెలో ఉన్న ఆరు క్వింటాళ్ల బియ్యం, బీరువా, బట్టలు, వంట సామగ్రి, భూములకు సం బంధించిన దస్తావేజులు, 10వేల నగదు కాలి బూడిదయ్యాయన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు చంద్ర తెలిపారు.

సోమవారం పోలీసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జములయ్య గ్రామ కార్యదర్శి మోఖా పరిశీలించి పంచనామా చేసి తహసీల్దార్‌కు సమ ర్పించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని పక్కా ఇల్లు నిర్మాణం చేయిం చాలని బాధితుడు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.